
నాలా మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే తన కర్తవ్యమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్ బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో రూ.93 కోట్లతో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న పనులు రూ.46 కోట్లతో నూతనంగా రూపొందించిన ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా లింక్ రోడ్లు, చెరువుల సుందరీకరణ, వైకుంఠదామాలు, గ్రేవ్‌యార్డ్‌లను ఉద్యానవనంలా మార్చడం, వరద కాలువ నిర్మాణం, క్రీడా మైదానాలు, పార్కుల సుందరీకరణ, జంక్షన్‌ల అభివృద్ధి, బతుకమ్మ ఘాట్ల తదితర వాటిపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖాధికారులు, ఈఈలు లక్ష్మీగణేశ్, కిష్టప్ప, డీఈ రూపాదేవి, పాపమ్మ, శిరీష, ఏఈలు మల్లారెడ్డి, కళ్యాణ్, తిరుపతి, స్వాతి, రవీందర్ పాల్గొన్నారు.


అమృతండాలో కూకట్‌పల్లి జడ్సీతో పర్యటించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అమృతండా నివాసితులకు ఇళ్లను కేటాయించాలి

ఫతేనగర్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): నాలా పక్కన దుర్భర జీవితాన్ని గడుపుతున్న నిరుపేదలకు గృహవసతిని కల్పించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఉదయం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అమృతండాలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలో నివాసముంటున్న 130 మందికి లాటరీ సిస్టం ద్వారా కైత్లాపూర్‌లో తండావాసులకు ఇళ్లను కేటాయించినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం నాలా పరీవాహక ప్రాంతంలో జీవిస్తున్న బస్తీవాసులకు ఇళ్లను మంజూ రు చేసిన వారిని ఆదుకోవాలని కోరారు.


పూర్తైన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తా : కొలన్

దుండిగల్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. చింతల్ డివిజన్‌లోని భగత్‌సింగ్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను బస్తీవాసులు గత నెల ఆయన దృష్టికి తీసుకొవచ్చారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు విషయం తెలిపిన హన్మంత్‌రెడ్డి స్పెషల్ ఫండ్స్ క్రింద రూ. 28 లక్షలను మంజూరి చేయించి భగత్‌సింగ్ నగర్‌లో సీసీ రోడ్డు పనులను పూర్తి చేయించి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పండరి రావు, బాల్‌రెడ్డి, నాగరాజు, సంజీవరెడ్డి, అంజలి, రజని, యాదవ్ పాల్గొన్నారు.


శ్రీశైలంగౌడ్‌ను కలిసిన బస్తీలవాసులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: మాజీ ఎమ్మెల్యే

గాజులరామారం, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్, చంద్రగిరినగర్ బస్తీల్లో నెలకొన్న సమస్యలపై శ్రీశైలంగౌడ్‌కు విన్నవించారు. అనంతరం ఆయన ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు జోనల్ కమిషనర్‌కు వివరించారు. సమాచారం వెళ్లి నిధులు మంజూరి చెయ్యాలని కోరగా రూ.74 లక్షలు మంజూరయ్యాయి. అంబేద్కర్‌నగర్, చంద్రగిరి నగర్ వాసులు మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, బుచ్చిరెడ్డి, రశీద్‌బేగ్, లాల్‌మహ్మద్, సతీష్, నవీన్, సంతోష్‌గుప్త పాల్గొన్నారు.

నేటి నుంచి వీధి శునకాలకు వ్యాక్సిన్

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నార్త్ ఎస్‌సీఎల్ పార్కులో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వీధి శునకాలు, పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ ఇవ్వనున్నట్లు కమిషనర్ శ్రీహరి, చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాక్సినేషన్‌ను బ్లూక్రాస్ సొసైటీ సంస్థ సౌజన్యంతో నిర్వహించనున్నట్లు, ప్రతీ ఒక్కరూ పెంపుడు కుక్కలు ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానీని 8555052118ని సంప్రదించాలని కోరారు.


జడ్సీ అపూర్వ్‌చౌహాన్‌తో మాట్లాడుతున్న బండి రమేష్, పుష్పారెడ్డి తదితరులు

పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలి

బాలానగర్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ కూకట్‌పల్లి సర్కిల్ జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో జడ్సీని కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఆగిపోయిన పనులకు నిధులు కేటాయించి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని జడ్సీని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, గొటిముక్కల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులు

మైహోంభుజా గేటెడ్ కమ్యూనిటీ నూతన కమిటీ ఎన్నిక

రాయదుర్గం: రాయదుర్గంలోని మైహోం భుజా గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ కమిటీకి ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ నానిరాజు, ఉపాధ్యక్షురాలిగా మాధవి, జనరల్ సెక్రటరీగా ఎన్. విద్యారెడ్డి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఓ.కుమార్, కోశాధికారిగా గౌరవ్ సోని, సంయుక్త కోశాధికారిగా కళా తాటికొండ, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎస్. రామకృష్ణారావు, సంజయ్‌సింగ్‌వి, డాక్టర్ టివి శ్రీనివాస్, జ్యోత్స్న ఎన్నికైనట్లు మాజీ ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ తెలిపారు.

అక్రమార్కులపై బల్దియా నజర్

- కేపీహెచ్‌బీ టీపీఎస్‌పై వేటుకు రంగం సిద్ధం
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఉద్యోగుల్లో భయం


కేపీహెచ్‌బీ రెండో రోడ్డులో నిర్మిస్తున్న ఆరు అంతస్తుల భవనం

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ భవనాలను సక్రమం చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులపై వేటుకు రంగం సిద్ధమైంది. 'డబ్బులు ఇస్తే అక్రమ భవనాలను సీజ్ చేయం' అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై బల్దియా ఉన్నతాధికారులు ఆరా తీశారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్స్ పరిధిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం ఎన్ని భవనాలను సీజ్ చేసింది. సీజ్ చేసిన భవనాల్లో పనులు చేసుకోమని భరోసా ఇచ్చిన టౌన్ ప్లానింగ్ ఉద్యోగి ఎవరు? అసలు నోటీసులు ఇవ్వకుండా, సీజ్ కాకుండా చూస్తున్న ఆ టీపీఎస్ ఎవరు అనే విషయంపై ప్రాథమిక నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. 'ఏపీఎస్ అయితే మీకేంటి? నేను అడిగినవి నాకు ముట్టజెబితే నేనే చూసుకుంటానని చెప్తున్నా కదా' అనే సదరు టీపీఎస్‌పై జోనల్ స్థాయిలోనే కాదు.. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా సీరియస్‌గా తీసుకున్నారట. అక్రమార్కుల అధికారుల జాబితాలో కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ టీపీఎస్ ఉన్నట్లు తేల్చారు. దీంతో ఆయనపై వేటు వేయాలని ఉన్నతాధికారులు చూస్తున్నారు. అవినీతి సిబ్బందిపై సస్పెన్షన్ వేస్తే మరి కొందరు అవినీతి అధికారులను దారిలో పెట్టవచ్చనే ఆలోచనలో ఉన్నతాధికారులు సమాలోచనల్లో మునిగి తేలారు. జడ్సీ కంట పడకుండా జాగ్రత్తలు తీసుకునే ఆ ఉద్యోగులు ఎవరై ఉంటారని ఎక్కడ నలుగురు సిబ్బంది కలిసినా ఇదే చర్చ జరు గుతోంది. సర్కిళ్ల పరిధిలోని డివిజన్ల వారీగా ఎన్ని అక్రమ నిర్మాణాలున్నాయి. నోటీసులు ఎందుకు ఇవ్వలేకపోయారు. నోటీసులు అందుకున్నా పనులు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు? సీజ్ అయిన భవనాల్లో పనులు చేసేలా సహకరించడం అంతర్యం ఏంటి ? ఆ కోణాల్లో నివేదిక తెప్పించుకునే పనిలో జడ్సీ ఉన్నారట. జోనల్ పరిధిలో చర్యలు తీసుకోవాలా ? బల్దియా ప్రధాన కార్యాలయానికి ఫైల్ పంపించాలా అనేది ఇంకా తుది నిర్ణయానికి రాలేకపోతున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో అక్రమ నిర్మాణాలకు అమ్యామ్యాలు పుచ్చుకొని అండగా నిలుస్తున్న అధికారులపై చర్యలు ఉంటాయని చెప్పుకుంటున్నారు.

దివ్యాంగుల సాధికారితకు సమ్మిళిత మెకానిజమ్స్

- కార్పొరేట్ లీడర్లతో హెచ్‌సీయూలో తొలి అడ్వకసీ ఇన్షియేటివ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ నియామక పద్ధతుల్లో వైవిధ్యంపై హెచ్‌సీయూలో తొలిసారిగా అడ్వకసీ ఇనిషియేటివ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపవర్‌మెంట్ కమిటీ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్‌పర్సన్స్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, చెన్నైకి చెందిన హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న దృష్టిలోపం ఉన్న విద్యార్థులతో పలువురు హెచ్‌ఆర్ నిపుణులు, కార్పొరేట్ లీడర్లు మాట్లాడారు. ఉపాధిలో దివ్యాంగులకు సమాన అవకాశాల కోసం సమ్మిళిత మెకానిజమ్స్ రూపొందించే దిశలో ఈ సమావేశం మైలురాయిగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థులను శక్తిమంతం చేయడానికి ఈ మెకానిజమ్స్ ఉపకరిస్తాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కార్పొరేట్ లీడర్ల సమూహాన్ని ఒకచోట చేర్చి హైదరాబాద్ నగరంలో ఈ రకమైన ఈవెంట్ జరగడం ఇదే తొలిసారి అని నిర్వాహకులు వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీడిమెట్ల పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలకి చెందిన పి.సాయికృష్ణ(23) కుత్బుల్లాపూర్‌లో గల శ్రీనివాస్‌నగర్‌లో నివాసముంటున్నాడు. సూరారంలోని ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం తను ఉంటున్న గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకొని ఉంటాడని కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు

'ల్యాబ్ టూ ల్యాండ్' వద్ద డీలర్ల ఆందోళన

రాయదుర్గం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లోని టీ హబ్‌లో ఉన్న ల్యాబ్ టూ ల్యాండ్ అగ్రిటెక్ కంపెనీ డీలర్లు మంగళవారం ఆందోళన చేశారు. కెమికల్స్ స్టాక్ పేరుతో తమ వద్ద వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలని టీ-హబ్ ప్రధాన గేటు నిరసన తెలిపారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆరు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు డీలర్లు కంపెనీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ అడుకుంది. దీంతో డీలర్లు మెయిన్‌గేటు వద్ద ధర్నా చేపట్టారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డీలర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడించారు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని టీహబ్‌లో ల్యాండ్ టూ ల్యాబ్ అగ్రిటెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉంది. ఈ కంపెనీ ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, క్రాప్ న్యూట్రీషన్, న్యూ కెమికల్ ఇన్నోవేషన్స్ వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా కొనసాగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పలువురు డీలర్లకు వ్యవసాయ సంబంధించిన రూ.50 వేల కెమికల్ స్టాక్ ఇచ్చి ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షలు వసూళ్లు చేశారు. క్రాప్మెడ్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుంటే డీలర్లకు అదనంగా ఆదాయం వస్తుందని నమ్మించారు. ఆ తర్వాత డీలర్లు తమకు ఇవ్వాల్సిన కెమికల్ స్టాక్ గురించి, ఇచ్చిన డబ్బుల గురించి యాజమాన్యాన్ని అడుగుతుంటే సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతున్నారని డీలర్లు ఆరోపించారు. డీలర్లతో పాటు కంపెనీ ఉద్యోగులకు అక్టోబర్ నుంచి జీతాలు కూడా చెల్లించలేదని తెలుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 500 మంది డీలర్ల నుంచి దాదాపు 15 కోట్లకు పైగా చీటింగ్ చేసినట్లు ఆరోపించారు. ఆరు నెలలుగా కంపెనీ సీఈఓ ఆదిత్యదేశపాండే తప్పించుకొని తిరుగుతున్నట్లు బాధితులు పేర్కొన్నారు. కంపెనీలో పనిచేసే ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్చి 28న ల్యాబ్ టు ల్యాండ్ కంపెనీపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం పలువురు డీలర్లు డబ్బుల కోసం ప్రతినిధులను నిలదీసేందుకు కంపెనీ ఉన్న టీహబ్ వద్దకు చేరుకున్నారు. సెక్యూరిటీ అడ్డుకోవడంతో డీలర్లు గేలు ఎదుట ఆందోళన చేపట్టారు. సెక్యూరిటీ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి వచ్చి డీలర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులను పీఎస్‌కు పిలిపించారు. వారం రోజుల్లో డీలర్లకు డబ్బులు చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు వారికి హామీ ఇచ్చారు.

వర్షం.. రోడ్లన్నీ జలమయం

దుండిగల్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): మంగళవారం కురిసిన భారీ వర్షంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రహదారులన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. నిండి పోయాయి. సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద మోకాలు లోతు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదే విధంగా జీడిమెట్ల డిపో, గండిమైసమ్మ చౌరస్తా ప్రాంతాల్లో రోడ్డుపై నీరు భారీగా చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద వరదనీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


గండిమైసమ్మ రోడ్డులో ..


భారీ వర్షంలో వరదనీటిలో వెళ్తున్న మహిళలు

జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) 53వ ఆవిర్భావ వేడుకలు జేఎన్‌టీయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ.. సమాజహితం కోసం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశం, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త శోభారాణి, పలువురు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



మియాపూర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 5 నుంచి 6.30 గంటల సమయంలో మియాపూర్ నుంచి కూకట్‌పల్లి వెళ్లేవైపు మెట్రో పిల్లర్ నెంబర్ 622 బస్టాప్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కూలి పనికోసం పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తిలా ఉన్నాడని, సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మల్లంపేటలో మహిళ హత్య

సెల్‌ఫోన్, చెవి కమ్మలు ఎత్తుకెళ్లిన నిందితుడు


శారద (ఫైల్)

దుండిగల్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): మల్లంపేటలో మహిళను గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసి పరారయ్యాడు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. నిందితుడి కోసం పోలీసులు గాయింపు చేపట్టారు మల్లంపేటలోని గ్రీన్‌పార్కు కాలనీ, శ్రీవంశీ రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో బొద్దుల శారద(50) నివాసం ఉంటుంది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఐదేళ్ల క్రితం భర్త చనిపోయారు. కుమార్తెకు వివాహం జరిపించారు. కుమారుడు సాయివినయ్ తల్లి వద్దనే ఉంటున్నాడు. ప్రైవేట్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే తల్లి శారదను సోమవారం ఆమె నిర్వహిస్తున్న విఘ్నేశ్వర మిల్క్ పాయింట్ వద్ద దింపి ఆఫీసుకు వెళ్లిపోయాడు. రాత్రి 8 గంటల సమయంలో తల్లికి కాల్ చెయ్యగా ఫోన్ ఎత్తలేదు. దీంతో పక్క ఫ్లాట్‌లో ఉన్న నరేష్‌కు విషయం చెప్పి ఇంటికెళ్లి చూడాలని కోరాడు. నరేష్ వెళ్లి చూడగా శారద మృతి చెంది ఉంది. ఈ విషయాన్ని సాయి వినయ్‌కి చెప్పగా, అతను వచ్చి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, దుండిగల్ సీఐ సతీష్ లు తన సిబ్బందితో వెళ్లి అపార్టుమెంట్ వద్ద ఉ న్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల్లో శారదతో పాటు మరో వ్యక్తి ఉదయం 11 గంటల సమయంలో ఫ్లాట్‌లోకి వెళ్లినట్లు ఒక గంట తరువాత ఎవరూ గుర్తుపట్టని విధంగా బయటకు వెళ్లిపోయాడు. మృతిరాలి చెవి కమ్మలు లాక్కెళ్లాడు. ఆమె సెల్‌ఫోన్ కూడా తీసుకొని వెళ్లిపోయిన ఆ వ్యక్తి.. పోలీసులు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. చివరకు పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ద్వారా ట్రాక్ చెయ్యడంతో చౌటుప్పల్ వద్ద ఉన్నాడని, ఆ తరువాత సిగ్నల్స్ ఆగిపోయినట్లు ఏసీపీ తెలిపారు. మృతిరాలికి పరిచయం ఉన్న వ్యక్తే హత్య చేసి ఉండొచ్చని ఏసీపీ అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్ పోలీసుల చిల్లర దందా ఆగేనా?

'ఆంధ్రజ్యోతి' కథనంపై చిరు వ్యాపారుల్లో చర్చ

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం తెల్లవారు జామున మార్కెట్‌కు వెళ్లి తీసుకొచ్చి రోడ్డు పక్కన అమ్ముకుంటుంటే తమపై పోలీసుల పెత్తనం చెలాయిస్తున్నారని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. 'ట్రాఫిక్ పోలీసుల చిల్లర దందా' శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం చర్చలకు దారి తీసింది. పోలీసులకు నచ్చితే ఓకే లేదంటే బండి తీయాల్సిందే..ఫైన్ అంటూ డబ్బాలు ఎత్తుకెళ్లిపోతారంటూ రాందేవ్‌రావు హాస్పిటల్ ముందు ఉన్న చిరువ్యాపారులు వాపోతున్నారు. అలాగే రైతుబజార్ రోడ్డులో కూడా పోలీసులకు పైకం చెల్లించాల్సిందేనంట. లేదంటే వాహనాలకు ఇబ్బంది అంటూ సాయంత్రం వేళ వారు చేసే హడావిడీతో ఇబ్బందులు పడుతున్నామని, వారు అడిగినంత ఇస్తే ఓకే లేదంటే నానా ఇబ్బందులు పెడుతుంటారని తోపుడు బండ్ల వ్యాపారులు చర్చించుకుంటున్నారు. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా చూడకుండా వారికి నెలవారీ ఆదాయం వచ్చే వాటిపైనే దృష్టిసారిస్తున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండేజాతీయ రహదారి వెంబడి, జేఎన్‌టీయూ నంచి హైటెక్‌సిటీ వెళ్లే మార్గాలతో పాటు నాలుగు, ఏడో ఫేజ్ వద్ద కూడా ఫోకస్‌పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లు చిరువ్యాపారులు చర్చించుకుంటుండటం గమనార్హం. ట్రాఫిక్ సైబరాబాద్ బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి మరి.

ఎస్‌వీకేలో సాయుధ రైతాంగం పోరాట వారోత్సవాలు


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య

రాయదుర్గం, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగం పోరాటం భూమి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వీకే)లో సాయుధ రైతాంగం పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఇటీవల మరణించిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతుల సాయుధ పోరాటం దేశ చరిత్రలోనే అత్యంత విలువైన పోరాటమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం కేవం నిజాం నవాబుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారని అసత్య ప్రచారం చేస్తోందన్నారు. బీజేపీకి ఈ పోరాటానికిఎలాంటి సంబంధం లేదన్నారు. కేవలం ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా దాని వైఖరి ఉందని ఆయన విమర్శించారు. ఈ వైఖరిని కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామ్య వాదులు తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నాయకులు శోభన్, కృష్ణ, మధుసూదన్‌రావు, సీతారామయ్య నాయకులు, తదితరులు ఉన్నారు.

డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు మహిళల అరెస్ట్

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): హోటల్‌కు వచ్చిన ఇద్దరు మహిళలు ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ ఉమెన్‌రైట్స్ ఐడీ కార్డులను చూపించి హోటల్‌లోని వంట గదిలోకి వెళ్లి అపరిశుభ్రంగా ఉందంటూ యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. పేట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మలక్‌పేటకు చెందిన భోగుల సునితా(50) సికింద్రాబాద్ రాహుల్‌నగర్ కాలనీకి చెందిన నీలివిజయలక్ష్మి(58) ఈనెల 23న సుచిత్రా పరిధిలోని గిస్మత్ మండీ హోటల్‌కు వచ్చారు. నిర్వాహకులకు ఐడీ కార్డు చూపించి, మీ హోటల్లోని ప్రాంతాలు మంచిగా ఉన్నాయా? అని అడిగి వంట గదిలోకి వెళ్లి అపరిశుభ్రంగా ఉన్నాయని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, హోటల్ మూసి వేయిస్తామని బెదిరించారు. తమకు డబ్బులు ఇస్తే వదిలేస్తామని భయపెట్టారు. యాజమాన్యం 100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు హోటల్‌కు వచ్చి వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకవచ్చారు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో ఫంక్షన్‌హాల్, రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న చిల్డ్రన్స్‌పార్క్ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మంగళవారం పరిశీలించారు. శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.

\- హైదర్‌నగర్, ఆంధ్రజ్యోతి